క్లుప్తంగా

పూనెం రమేష్‌ను కోర్టులో హాజరుపరచాలి

భానుపురి : సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, దళ కమాండర్ పూనెం రమేష్‌ను వెంటనే కోర్టులో హాజరు పరచాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఇల్లందు మండలం ఎల్లాపురం గ్రామంలో అనారోగ్యంతో ఉన్న పూనెం రమేష్‌ను పోలీసులు అరెస్టు చేసి నిర్బంధించారని తెలిపారు. ఇప్పటి వరకు రమేష్ ఆచూకీని పోలీసులు ప్రకటించక పోవడంతో కుటుంబ సభ్యులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.

నాగారం : సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, అజ్ఞాత దళ కమాండర్ పూనెం రమేష్‌ను వెంటనే కోర్టులో హాజరుపరచాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయనతో పాటు ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి సంపెట కాశయ్య, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, సుధాకర్‌రెడ్డి, గణేష్ తదితరులు ఉన్నారు.

రేఖ ఫౌండేషన్ సేవలకు అభినందనలు



వేం నరేందర్ రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాకురాలు రేఖ

అర్వపల్లి : రేఖ చారిటబుల్ ఫౌండేషన్ సేవలను రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు(సీఎం ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్‌రెడ్డి అభినందించారని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి డాక్టర్ బోయలపల్లి రేఖ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లో వేం నరేందర్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఫౌండేషన్ చేస్తున్న సేవలను ఆయనకు తెలియజేశారు. ఫౌండేషన్ సేవలను విస్తృతం చేయాలని నరేందర్‌రెడ్డి కోరినట్లు చెప్పారు.

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరుకావాలి

నాగారం : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో శనివారం జరిగే రైతు పండుగ మహాసభలో సీఎం రేవంత్‌రెడ్డి రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తారని, ఈ సందర్భంగా వర్ధమానుకోట రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం ఉంటుందని మండల వ్యవసాయశాఖ అధికారి కృష్ణకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులందరూ అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నూతనకల్ : తాళ్లసింగారం రైతు వేదికలో శనివారం నిర్వహించే రైతు సంబరాలకు రైతులు పెద్దసంఖ్యలో హాజరుకావాలని ఏఓ మురళీబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న రైతు పండుగను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించి విజయవంతం చేయాలని రైతులను కోరారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

అర్వపల్లి : అర్వపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్నధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఐకేపీ ఏపీఎం వలిశెట్టి మల్లేష్ శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సన్నధాన్యాన్ని కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ పెండోట గణేష్, గిర్దావర్ పాటి వెంకట్‌రెడ్డి, ఏఈఓ శోభారాణి, సీసీ నగేష్, అధ్యక్షురాలు మేకల సునీత, వీఓఏ కృష్ణకుమారి పాల్గొన్నారు.

మద్దిరాల : తుపాన్ దృష్ట్యా వర్షాలు పడే అవకాశం ఉన్నందున్న రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. శుక్రవారం మద్దిరాల మండల కేంద్రంలోని ఎమ్ఎస్, పోలుమల్ల గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మాట్లాడారు. వాతావరణం మబ్బులు పడుతున్నందున రైతులు ధాన్యంపై టార్పాలిన్లు కప్పి జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

గణితశాస్త్రంలో ప్రతిభా పోటీలు



సూర్యాపేట : విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



ఆత్మకూర్ (ఎస్) : ప్రశంసాపత్రాలతో విద్యార్థులు



పెన్‌పహాడ్ : మండల వనరుల కేంద్రంలో ప్రశంసాపత్రాలు, షీల్డులతో విద్యార్థులు



అర్వపల్లిలోని మండల వనరుల కేంద్రంలో..

సూర్యాపేట : విద్యార్థులు నిత్య జీవితంలో గణితం ఆవశ్యకతను గుర్తించాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జె.ఆంద్రయ్య అన్నారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని దశరథ మెమోరియల్ ఫౌండేషన్ వారి సహకారంతో జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో శుక్రవారం విద్యార్థులకు మండల స్థాయి గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర బాధ్యుడు జి.వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గణిత ఫోరం సూర్యాపేట మండల అధ్యక్షుడు ఎస్.మురళి, ప్రధాన కార్యదర్శి జె.బీబీనాంచారి, గణిత ఉపాధ్యాయులు శ్రీరాములు, మురళికృష్ణ, అరుణభారతి, ఆండాలు, శోభరాణి, సుజాత, రాణి, పుష్పలత, పరమేష్, ఉదయ్‌భాస్కర్, భాస్కర్‌రెడ్డి, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

గణిత ప్రతిభా పోటీలు విజయవంతం

జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా దశరథ మెమోరియల్ ఫౌండేషన్ వారి ఆర్థిక సహకారంతో అన్ని మండలాల్లో మండల స్థాయి గణిత ప్రతిభా పోటీలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలంగాణ గణిత ఫోరం జిల్లా శాఖ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండా వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం స్థానికంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. దశరథ మెమోరియల్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్‌వీవీ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ కుమార్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దశరథ మెమోరియల్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీ కొత్తపల్లి సురేష్, జిల్లా అధ్యక్షుడు ఎం.అశోక్, ప్రధాన కార్యదర్శి దామల్ల కోటేశ్వరరావు, ట్రెజరర్ మంచాల శ్యాము, జిల్లా బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు గణిత టాలెంట్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ధారాసింగ్ మాట్లాడారు. విద్యార్థులు ప్రతిభా పోటీల్లో పాల్గొని నైపుణ్యత పెంపొందించుకోవాలని అన్నారు. ఈ టెస్టులో తుమ్మల పెన్‌పహాడ్ జిల్లా పరిషత్ విద్యార్థులు ప్రథమ స్థానం పొందగా, మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయస్థానం సాధించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ మురళీకృష్ణ, స్థానిక ప్రధానోపాధ్యాయులు శ్రవణ్ కుమార్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు శ్యాం కుమార్, మల్లారెడ్డి, దుర్గా ప్రసాద్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంపొందుతుంది

నూతనకల్ : విద్యార్థులకు నిర్వహించే వివిధ టాలెంట్ టెస్టుల ద్వారా వారిలో సృజనాత్మకత పెంపొందుతుందని తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గణితశాస్త్ర టాలెంట్ పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సునీత, ఎంఈఓ రాములునాయక్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని ఎమ్మార్సీలో విద్యార్థులకు శుక్రవారం మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ బి.బాలునాయక్ మాట్లాడారు. గణితంపై ఎక్కువ శ్రద్ధ కనబర్చి పదవ తరగతిలో అత్యధిక మార్కులు తెచ్చుకోవాలని కోరారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎంఎఫ్ మండల అధ్యక్షుడు జి.కాల్‌రాం, జిల్లా ఉపాధ్యక్షుడు జలగం పురుషోత్తం, కోశాధికారి కె.భాస్కర్, ఉపాధ్యాయులు శ్రీరాములు, కృష్ణ, రమేష్, గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దిరాల : గణితశాస్త్రం విద్యార్థి భవిష్యత్‌లో ప్రధానపాత్ర పోషిస్తుందని ఎంఈఓ తండు వెంకటనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గణిత ఫోరం మండలశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండలస్థాయి గణిత ప్రతిభా పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈఓ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గణితఫోరం మండల అధ్యక్షుడు దార భిక్షం, మండల కోశాధికారి గండు కరుణాకర్ పాల్గొన్నారు.

టాలెంట్ టెస్టులో జిల్లా స్థాయికి ఎంపిక

నాగారం : తెలంగాణ మ్యాథ్స్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి గణిత ప్రతిభ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలకు చెందిన విద్యార్థులు రాణించి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు మండల విద్యాధికారి వాసం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మ్యాథ్స్ టాలెంట్ టెస్టుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు షీల్డ్, ప్రసంసాపత్రాలు అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంలు జ్ఞానేశ్వరచారి, బూరానోద్దీన్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్ బల్గూరి చంద్రబాబు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : విద్యార్థులు కష్టపడి చదివి జిల్లా స్థాయిలో మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. శుక్రవారం టీఎంఎఫ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మండల వనరుల కేంద్రంలో దశరథ మెమోరియల్ ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు మ్యాథ్స్ ట్యాలెంట్ టెస్ట్ నిర్వహించారు. టెస్టులో మండల స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, షీల్డ్‌లు అందజేశారు.

సమస్యల పరిష్కారంలో ముందంజ



మాట్లాడుతున్న శ్రీపాల్‌రెడ్డి

సూర్యాపేట : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూ టీఎస్ కీలక పాత్ర పోషిస్తుందని వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఉపాధ్యాయులు గడ్డం వెంకటేశ్వర్లు, ఐతగోని సైదులును ఓటు అభ్యర్థించి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులకు 30శాతం పీఆర్సీ ఫిట్‌మెంట్, ఉద్యోగ విరమణ వయస్సు 61 సంవత్సరాలకు పెంపు, పండిట్, పీఈటీ అప్‌గ్రేడేషన్‌తోపాటు వేలాది మందికి ఉద్యోగోన్నతులు కల్పించేలా పోరాటం చేసినట్లు గుర్తు చేశారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్సీగా గెలిపిస్తే సీపీఎస్ రద్దు, ఉద్యోగులకు హెల్త్‌కార్డులు, కేజీబీవీ ఉపాధ్యాయులకు కనీస వేతన స్కేల్ అమలు, ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తంగెళ్ల జితేందర్‌రెడ్డి, తీగల నరేష్, జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జ్ కందుకూరి శివశంకర్, యాదాద్రి జిల్లా అధ్యక్షుడు కుంట్ల అమరేందర్, రాష్ట్ర బాధ్యుడు సోమిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాజీ అధ్యక్షుడు కొండేటి రవీందర్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు దండగుల ఎల్లయ్య, గుజ్జ భాస్కర్, పొన్నగంటి ప్రతాప్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు అల్లారెడ్డి సత్యనారాయణ, సూర్యాపేట మండల అధ్యక్షుడు వల్లెం శంకర్, ప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టల్స్, గురుకులాల్లో వరుస ఘటనలపై ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించే ప్రభుత్వ పాఠశాలల బంద్‌ను విజయవంతం చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు శ్రీకాంత్ వర్మ, గోపగాని రవి, పుల్లూరి సింహాద్రి కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న ఫుడ్ పాయిజన్ ఘటనలు, విద్యార్థుల మరణాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి తక్షణమే రివ్యూ సమావేశం ఏర్పాటు చేసి సమీక్షించాలన్నారు. తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ వినోద్ కుమార్, పిడమర్తి భరత్, శ్రీకాంత్, విష్ణు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో దీక్షా దివస్



తుంగతుర్తిలో తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తుంగతుర్తి : తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ దీక్షతోనే సాధ్యమైందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. దీక్షాదివస్‌ను పురస్కరించుకొని శుక్రవారం మండల కేంద్రంలో మెయిన్ రోడ్డుపై కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతయ్య మాట్లాడుతూ దీక్షాదివస్ చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గుండగాని రాములు, తునికి సాయిలు, దుర్గయ్య, దశరథ, బొంకూరి మల్లేష్, గోపగాని శ్రీనివాస్, వెంకన్న, తిరుపతి, సుధాకర్, నాగమల్లు, శ్రీహరి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

చివ్వెంల : కార్తీకమాసం స్వాతి నక్షత్రం సందర్భంగా మండల పరిధిలోని ఉండ్రుగొండ గ్రామ శివారులోని శ్రీ లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి వేదపండితులు రవికుమార చార్యులు, క్రిష్ణమాచార్యులు మంత్రోచ్ఛరణతో పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం భూదేవి, శ్రీదేవి సమేతంగా కల్యాణం జరిపించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం క్రిష్ణకుమార్, బందకవి క్రిష్ణమోహన్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్ధారణపై వైద్యసిబ్బందికి అవగాహన



మాట్లాడుతున్న సీహెచ్‌ఓ శరణ్‌నాయక్

నాగారం : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టు వ్యాధి నిర్ధారణపై ఆరోగ్య సిబ్బందికి, ఆశ కార్యకర్తలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడారు. డిసెంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు కుష్టు కేసుల అనుమానిత నిర్ధారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటికీ ఆశ కార్యకర్తలు వెళ్లి స్పర్శ లేని, రాగి రంగు మచ్చలు ఉన్నవారిని గుర్తించాలని అన్నారు. వారికి ఎండీటీ ద్వారా వైద్యం అందిస్తే వ్యాధి పూర్తిగా నయం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పల్లె దవాఖానా డాక్టర్లు శ్రవణ్‌కుమార్, నజీయ, హెచ్‌ఈఓ మాలోతు బిచ్చునాయక్, హెచ్‌ఈ విమలమ్మ, అరుణకుమారి, సుజాత, సూపర్‌వైజర్లు వినోద, సిబ్బంది యాదగిరి, ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : కుష్టు వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించి పూర్తిస్థాయిలో నిర్మూలించే విధంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని సీహెచ్‌ఓ శరణ్‌నాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లకు నిర్వహించిన సదస్సులో పాల్గొని మాట్లాడారు. కుష్టు వ్యాధి చికిత్స అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందుబాటులో ఉందని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

మద్దిరాల : సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేద కుటుంబాలకు వరంలాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మార్త కృష్ణమూర్తి అన్నారు. మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన శ్యాంబాబు, గోరెంట్ల గ్రామానికి చెందిన బంధు యాదగిరి అనారోగ్యం కారణంగా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా శ్యాంబాబుకు రూ.60 వేలు, యాదగిరికి రూ.25వేల చెక్కులు మంజూరయ్యాయి. ఆ చెక్కులను శుక్రవారం లబ్ధిదారులకు అందజేసినట్లు కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో నలమాస ఉపేందర్, దగ్గుల మల్లయ్య, మల్లారపు కాశయ్య, కోటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



పోలుమల్ల ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్



నూతనకల్‌లోని పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న అధికారులు



నాగారం : పసునూర్ మోడల్‌స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మద్దిరాల : పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం వడ్డించాలని తహసీల్దార్ అమీన్ సింగ్ అన్నారు. శుక్రవారం పోలుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటలను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : నాగారం మండల కేంద్రంలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు జాజుల వీరయ్య మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కన్నెబోయిన వెంకటభిక్షం, అనంతుల వెంకటయ్య, మంగదుడ్ల దశరథ, లింగమల్లు, మహేష్‌కుమార్, ధనమ్మ పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ లాలు అన్నారు. శుక్రవారం దోసపహాడ్ గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలను, అనాజీపురం ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సన్న బియ్యం, ఇతర సరుకుల నాణ్యతను, విద్యార్థుల కోసం వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి వస్రాం, పాఠశాల ప్రిన్సిపాల్ ఆదిలక్ష్మి, ఆదర్శ పాఠశాల కేర్‌టేకర్ ఉమలత పాల్గొన్నారు.

నూతనకల్ : పాఠశాలల్లో అందించే మధ్యాహ్న భోజనంలో నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు పాటించాలని తహసీల్దార్ ఎం. శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మెనూ ప్రకారం నాణ్యమైన కూరగాయలు, వంట నూనెలను వాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం. సునీత, ఎంఈఓ రాములునాయక్ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తంగెళ్ల లక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో పిల్లలకు వడ్డించే ఆహారాన్ని పరిశీలించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. నాణ్యమైన భోజనం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌హెచ్‌ఓ సరస్వతి, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నాగారం : విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ మారయ్య అన్నారు. శుక్రవారం పసునూర్ మోడల్‌స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ చంద్రబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

తిరుమలగిరి : విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని తిరుమలగిరి మండల కేంద్రానికి చెందిన ప్రవాస భారతీయుడు సంకెపల్లి జగన్మోహన్‌రెడ్డి కోరారు. శుక్రవారం తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న 74 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దామెర శ్రీనివాస్, మమతారెడ్డి, జోసమ్ హెల్ప్‌న్, విశ్రాంత ఉపాధ్యాయుడు రెహమాన్‌అలీ, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు సోమయ్య, వెంకన్న, జానయ్య, లక్ష్మణ్, సత్తిరెడ్డి, విజయలక్ష్మి, యాదగిరి పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణ పనులకు భూమిపూజ

అర్వపల్లి : తిమ్మాపురంలో విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో నిర్మించనున్న శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మండపానికి శుక్రవారం ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణిశ్రీకాంతరాజు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బౌరోజు నారాయణచారి, నాగరాజు, నాగేంద్రాచారి, రమణచారి, బ్రహ్మచారి, పాపయ్య, జగన్, మదన్, రమష్, పోతులూరు, భక్తులు, ఆరాధ్య ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

అర్వపల్లి : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన అర్వపల్లి శివారులోని హజ్రత్ సయ్యద్ ఖాజా నసీరుద్దీన్‌బాబా దర్గా ఉర్సు సందర్భంగా నిర్వాహకుడు మహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో సుమారు 2వేల మంది భక్తులకు శుక్రవారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కర్నాని రమేష్, కోమటి సోమయ్య, మధు, అశు, చోటు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా క్వారీ.. అడ్డుకునే వారేరీ



ప్రమాదకరంగా ఉన్న క్వారీ

విచారణ చేసి చర్యలు తీసుకుంటాం

బొప్పారంలో క్వారీ పనులకు సంబంధించి మైనింగ్, రెవెన్యూ అధికారుల సహకారంతో విచారణ చేపడుతాం. భూ సమస్యలు, లీజు సమస్యలు ఉన్నట్లయితే నిర్వాహకులపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటాం. గ్రామస్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. – శ్రీకాంత్‌గౌడ్, ఎస్‌ఐ

ఆత్మకూర్(ఎస్) : బొప్పారం గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న క్వారీ మళ్లీ ప్రారంభమవుతున్నట్లు తెలుస్తోంది. క్వారీ చుట్టూ రక్షణ కంచె అమర్చాల్సిన యజమానులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రమాదాలకు నెలవుగా మారింది. ప్రస్తుతం నిర్వహించనున్న క్వారీ రావిపహాడ్ రోడ్డు పక్కనే ఉంటుంది. అయితే నిత్యం ఈ రహదారిపై వందల మంది రైతులు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ క్వారీ చుట్టూ ఎలాంటి రక్షణ ఏర్పాట్లు చేపట్టకుండానే ప్రారంభించాలని చూస్తుండడంతో ఎలాంటి ప్రమాదం పొంచి ఉంటుందోనని పలువురు అంటున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా..

ఇదివరకే బొప్పారంలో క్వారీని తవ్వి వదిలేయడంతో నలుగురు ప్రాణాలను కోల్పోయారు. అయితే ఈ క్వారీ యజమానిపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వస్తున్నాయి. క్వారీ యజమాని అక్రమ మార్గంలో తప్పుడు భూరికార్డులను చూపించి అనుమతులు తెచ్చుకుని, తన అవసరం మేర రాయిని తవ్వుకొని కోట్ల రూపాయలు సంపాదించుకున్నారు. అయితే వాటా దారుల వివాదం కారణంగా క్వారీని మధ్యలోనే వదిలేశారు. కానీ క్వారీ చుట్టూ రక్షణ కంచె అమర్చాల్సిన నిర్వాహకులు నిర్లక్ష్యంగా వదిలేయడంతో క్వారీ గుంతలో పడి రెండునెలల వ్యవధిలోనే నలుగురు వ్యక్తులు మృతిచెందారు. ఈ విషయమై అప్పట్లో స్థానికులు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ మేరకు మైనింగ్ అధికారులు కాంట్రాక్టు లైసెన్సు రద్దు చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు.

చర్యలు తీసుకోకుండా వదిలేయడంతో..!

నలుగురు ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన కాంట్రాక్టర్‌పై అధికారులు, పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోయారు. పోలీస్ అధికారులు, గ్రామస్తులే సొంత ఖర్చులతో క్వారీ గుంతల చుట్టూ కంచె వేశారు. ఇటీవల సదరు కాంట్రాక్టర్ సంబంధిత అధికారులను మచ్చిక చేసుకుని నిలిపివేసిన క్వారీని మళ్లీ కొనసాగించేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు క్వారీ పనులు నిలిపేయాలని అడ్డుకున్నారు. ఈ ఘటనలో స్థానికులపై కేసులు నమోదు చేసే ప్రయత్నం కూడా జరుగుతోందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. క్వారీ లీజు, భూమికి సంబంధించి కోర్టు, ఆర్డీఓ పరిధిలో వివాదం ఉన్నప్పటికీ సదరు కాంట్రాక్టర్ క్వారీని కొనసాగించే ప్రయత్నంలో ఉన్నాడని తెలిసింది. ఇప్పటికైనా కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని, లేకుంటే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని ఇటీవల గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు.

• అట్టహాసంగా సీపీఎం బహిరంగ సభ



సూర్యాపేటలో నిర్వహించిన సీపీఎం జిల్లా బహిరంగ సభకు కోలాటం ఆడుతూ బోనాలు, గొడుగులతో ప్రదర్శనగా వెళ్తున్న మహిళలు



బహిరంగ సభకు భారీ ర్యాలీగా వెళ్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు



బతుకమ్మలతో మల్లు లక్ష్మి, తదితరులు



నాగళ్లను ఎత్తుకున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి